క్లుప్తంగా

టీడీపీ 'తొలి అడుగు'లో నిలదీత

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గొల్లకంచరపాలెం తోటవీధి, దుర్గానగర్ ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించిన 'సుపరిపాలనలో -తొలి అడుగు' కార్యక్రమానికి నిలదీతలు ఎదురయ్యాయి. వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ ఎమ్మెల్యే గణబాబు కుమారుడు పి.మౌర్య వార్డులో పర్యటించారు. గొల్లకంచరపాలెంలో నెలకొన్న సమస్యలు నేటి పరిష్కారం కాకపోవడంతో స్థానిక ప్రజలు టీడీపీ నాయకులపై మండిపడ్డారు. వార్డులో కానరాని కార్పొరేటర్ రాజశేఖర్ అంటూ నినాదాలు చేశారు. రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ సమస్యలపై కార్పొరేటర్‌ను నిలదీశారు. సుపరిపాలనలో తొలి అడుగు లేదు.... వార్డులో అన్ని సమస్యలే అంటూ పి.మౌర్యకు వినతి పత్రం అందించారు. సమస్యలు అన్ని పరిష్కారించిన తర్వాత వార్డులో తొలి అడుగులు వేయాలని ఎద్దేవా చేశారు. దీంతో అక్కడ నుంచి వేరే వీధికి నాయకులు, కార్యకర్తలు వెళ్లిపోయారు.

రావాడ అప్పారావుకు సత్కారం



రావాడ అప్పారావును సత్కరిస్తున్న మళ్ల విజయప్రసాద్ తదితరులు

మల్కాపురం: గత నెలలో ఉద్యోగ విరమణ చేసిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రావాడ అప్పారావును ఘనంగా సత్కరించారు. ఆయన అభిమానులు,కుటుంబ సభ్యులు మంగళవారం 58వ వార్డు పిలకవానిపాలెంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సభ నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త,మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ హాజరై అప్పారావుకు శాలువ కప్పి సత్కరించారు. పూర్వం మాదిరిగానే పార్టీకి సేవలు అందించాలని కోరారు. 58,62వ వార్డులఎకార్పొరేటర్లు గులిగిందల లావణ్య, బల్లా లక్ష్మణరావు,58వ వార్డు పార్టీ అధ్యక్షుడు గులిగిందల కృష్ణ తదితురులు పాల్గొన్నారు.

దుకాణదారులకు నోటీసులు



దుకాణదారునికి నోటీసు అందిస్తున్న ఎస్‌ఐలు అప్పలనాయుడు, రామారావు

గోపాలపట్నం: దేవాలయాలు, పాఠశాలలకు వంద మీటర్ల సమీపంలో ఉన్న దుకాణదారులు పొగాకు తయారీ వస్తువులు అమ్మరాదని సూచిస్తూ గోపాలపట్నం ఎస్‌ఐలు అప్పలనాయుడు, రామారావు నోటీసులు అందించారు. జీవీఎంసీ 89వ వార్డు పరిధిలో పలు దుకాణాల యజమానులకు మంగళవారం వీటిని అందించారు. సిగరెట్లు, పొగాకు కలిపిన గుట్కాలు, గంజాయి వంటివి అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్ తాగినవారికి సైతం జరిమానాలు విధిస్తామన్నారు. సీఐ ఎస్వీ ప్రభాకర్ ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా పెట్టడంతో పాటు ప్రత్యేక రౌండ్లు వేస్తామని.. ఎవరు దొరికినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఆధ్యాత్మికవేత్త రాజశేఖర్‌కు సత్కారం

దాబాగార్డెన్స్: టౌన్ కొత్తరోడ్డులో వేంచేసిన జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవంలో సేవలందించిన పలు సంస్థలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన పలువురిని మంగళవారం ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. సాంస్కృతిక కార్యకరమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ సేవలను గుర్తిస్తూ సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు పి.జగన్నాథాచార్యులు, సిబ్బంది ప్రసాద్, శ్రీరామ్, శ్రీహరి సేవకులు ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



మూలకు చేరిన మంచినీటి ట్యాంకు, వ్యర్థాలతో భవనం ఆవరణ

నాడు: ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టణ ఆరోగ్య కేంద్రాల రూపు రేఖలు మార్చింది. అవసరమైన మౌలిక వసతులు కల్పించింది.వైద్యులు, సిబ్బందితో పాటు సరిపడా అదనపు భవనాలు నిర్మించింది. పేదలకు వైద్యాన్ని చేరువ చేసింది. ఈ క్రమంలోనే రామ్మూర్తిపంతులుపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో రూ.47 లక్షలు వెచ్చించి అదనపు భవనం నిర్మించింది. ప్రారంభించే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయింది.

నేడు: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ వైద్యాన్ని నిర్వీర్యం చేసింది. స్పెషలిస్ట్ సేవలకు మంగళం పాడింది. మందుల సరఫరాలో కూడా కోత పెట్టింది. వసతుల కల్పనలో విఫలమవుతోంది. ఆఖరికి ఉన్న వసతులను కూడా వినియోగించకుండా తాత్సారం చేస్తోంది. దీంతో రూ.47 లక్షలు పెట్టి నిర్మించిన భవనం ఏడాది దాటినా ప్రారంభానికి నోచుకోలేదు. ఇప్పటికీ ముహూర్తం కుదరలేదా అని రోగులు పాలకులను ప్రశ్నిస్తున్నారు.



అదనపు భవనంలో మూలకు చేరిన పడకలు

ముహూర్తం కుదరలేదా?

• రూ.47 లక్షలతో అదనపు భవనం • ప్రారంభానికి నోచుకోని వైనం



మెట్ల వద్ద సామగ్రి

ఇరుకు గదుల్లోనే వైద్య సేవలు

ప్రారంభించాలని రోగుల మొర



వైద్యకేంద్రం పరిసరాలు ఇలా ..

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం దరి రామ్మూర్తిపంతులుపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకు గదుల్లోనే వైద్య సేవలు అందిస్తున్నారు. నిత్యం అవుట్ పేషెంట్ విభాగంలో సుమారు 130 నుంచి 150 మంది రోగులు వస్తుంటారు. సరిపడా వసతులు లేక అటు రోగులు, ఇటు వైద్య సిబ్బంది, వైద్యాధికారులు ఇబ్బందులు పడుతున్నారు. పరిసరాలు అధ్వానంగా మారాయి. రోగులు రాకపోకలు సాగించే చోటే మెడిసిన్ సామగ్రి పెట్టడంతో అధ్వానంగా కనిపిస్తున్నాయి. ఇరుకు గదిలో అన్ని రోగాలకు పరీక్షలు చేయడంతో రోగుల బంధువులు, వైద్య సిబ్బంది కూడా కొత్త రోగాలతో ఇళ్లకు వెళ్లే పరిస్థితి కనిపిస్తోంది. అదనపు భవనం ప్రారంభించాలని కోరినా పట్టించుకునే నాధుడే కనిపించడంలేదని వాపోతున్నారు.

నిధులు నిరుపయోగం

ఇక్కడి ఆర్పీపేట ప్రజా పట్టణ ఆరోగ్య కేంద్రం(డిస్పెన్సరీ) పుష్కర కాలం కిందట నిర్మించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోఅదనపు భవన నిర్మాణానికి సుమారు రూ.47లక్షలు మంజూరు చేశారు. అదనపు భవనానికి శంకుస్థాపన చేసిన ఏడాదిలోనే నిర్మాణం పూర్తి చేశారు. అదనపు భవనం సమయానికి పూర్తి చేసినా....సార్వత్రిక ఎన్నికల కోడ్ కూసింది. ఎన్నికలు పూర్తయి ఏడాది పాలన చేసినా కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులకు తీరిక లేదన్నట్టుగా అదనపు భవనం ప్రారంభించలేదు. అంతే కాకుండా కూటమి నాయకులకు నిధులు సరిపడకపోవడంతో అదనపు భవన నిర్మాణంలో లోపాలు ఉన్నాయంటూ మూడు నెలల కిందట రూ. 12లక్షలు మంజూరు చేయించి తూతూ మంత్రంగా పనులు జరిపి అదనపు భవనానికి తాళాలు వేశారు.



సమన్వయలోపమే శాపమా!

ప్రజా ఆరోగ్య కేంద్రం అదనపు భవనాన్ని ప్రారంభించాలని రోగులు, వైద్యసిబ్బంది మొర పెట్టుకున్నా ప్రయోజనం కనిపించడంలేదు. జీవీఎంసీ జోన్-5 ఇంజినీరింగ్ అధికారులు పనులు పూర్తి చేసి డీఎంహెచ్‌వోకు అదనపు భవనం అప్పజెప్పారు. అయితే అధికారులు ప్రారంభించడం ప్రజాప్రతినిధులు చేతుల్లో ఉందంటూ వివరణ ఇచ్చుకొచ్చారు. కూటమి ప్రభుత్వం పూర్తయిన భవనాన్ని ప్రారంభించేందుకు మీనమేషాలు లెక్కిస్తుందని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేదలంటే అలుసా..

అదనపు భవనానికి సౌకర్యాల కోసం రూ.12 లక్షలు పెట్టి తూతూ మంత్రంగా పనులు చేశారు. కనీసం అధికారులు పర్యవేక్షించలేదు. పోనీ పేద ప్రజలకు వైద్యం అందించడానికి నిర్మించిన భవనాన్ని ప్రారంభించకుండా తాళాలు వేసి వదిలేశారు. ఇది నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తుంది.

అన్నీ ఇబ్బందులే

ఇరుకు గదుల్లోనే వైద్యసిబ్బంది రోగులకు సేవలు అందిస్తున్నారు. అదనపు భవనం నిర్మించి ఏడాది దాటినా ప్రారంభించకపోవడం దారుణం. రోగాలతో వైద్యం కోసం వచ్చేవారు కొత్త రోగాలు అంటించుకునే పరిస్థితి కనిపిస్తుంది. రక్తపరీక్షలు, మందులు ఇచ్చేగది, ఓపీ నమోదు అన్ని ఒకే చోట ఉండడంతో ఇబ్బందిగా మారుతుంది. మళ్లీ ఎలాంటి వ్యాధులు అంటుతాయోనని ఆందోళనగా ఉంటుంది.

– పీఎం. సత్యనారాయణ, దుర్గానగర్, కంచరపాలెం

పాలకులు స్పందించాలి

గత ప్రభుత్వంలో నిధులు వెచ్చించి ఆదనపు భవనం నిర్మాణం చేపట్టారు. ఎన్నికలు రావడంతో ప్రారంభించలేదు. కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా ఇప్పటివరకు అదనపు భవనం ప్రారంభించకపోవడం దారుణం, ప్రజాప్రతినిధులు రోగుల కోసం ఆలోచించి భవనం ప్రారంభించాలి. దీనికి సంబంధించిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

-ఒ.వెంకటలక్ష్మి, గొల్లకంచరపాలెం,

స్మార్టు మీటర్లు మాకొద్దు

వ్యతిరేకిస్తున్న ప్రజలు

మల్కాపురం: తమ ఇళ్లకు విద్యుత్ స్మార్టు మీటర్లు బిగించి నిలువు దోపిడీ చేయవద్దని పారిశ్రామిక ప్రాంతానికి చెందిన కొంత మంది స్పష్టం చేశారు. స్మార్టు మీటర్లు ఏర్పాటు చేయవద్దు అంటూ వారు ప్లకార్డులతో నిరసన తెలిపారు. 59వ వార్డు నెహ్రూనగర్‌లో మంగళవారం సీపీఎం నాయకులు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ చేపట్టారు.వారికి మద్దతుగా కొంత మంది నివాసీయులు ప్లకార్డులతో తమ నిరసన వ్యక్తం చేశారు.సీపీఎం మల్కాపురం జోన్ కమిటీ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, పెంటారావు మాట్లాడుతూ అదానీ సంస్థకు చెందిన స్మార్టు మీటర్లను రాష్ట్రంలో ప్రతి ఇంటికి అమర్చాలనే ఆలోచనలో కూటమి సర్కారు ఉందన్నారు. స్మార్టు మీటర్ల ఏర్పాటు వల్ల ప్రస్తుతం ఉన్న విద్యుత్ చార్జీల కంటే అదనంగా బిల్లు వస్తుందని అన్నారు.ఇప్పటికే రాష్ట్రంలో విద్యుత్ చార్జీల మోత ఎక్కువగా ఉందని, ఇక స్మార్టు మీటర్లు ఏర్పాటు చేస్తే మరింత అధికంగా బిల్లులు వస్తాయని ఆరోపించారు. వాణిజ్య సంస్థలకు గతం కంటే ఇప్పుడు రెట్టింపు విద్యుత్ బిల్లులు వస్తున్నాయని వివరించారు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్మార్టు మీటర్లను వ్యతిరేకించిన కూటమి నాయకులు ఇప్పుడు ఎందుకు మౌనం వహించారని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



స్మార్టు మీటర్లు మాకు వద్దంటూ నినాదాలు చేస్తున్న ప్రజలు

ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలి

విశాఖ విద్య: ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించడంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్)విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు ,టి.ఆర్.అంబేడ్కర్ డిమాండ్ చేశారు. ఎస్‌ఏడీలోని యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సంబంధిత అధికారులు తగిన చొరవ చూపకపోవడం వల్ల జీతాలు రావడానికి ఎంత సమయం పడుతుందనే ఆందోళనలో ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. జూన్ 15 నాటికి బదిలీ ప్రక్రియ పూర్తయినప్పటికీ, వేతనాల చెల్లింపు సమస్యలకు పరిష్కారం లభించడం లేదన్నారు. క్లియర్ వేకెన్సీ లో జాయిన్ అయి ఎల్‌పీసీలు సమర్పించిన ఉపాధ్యాయులకు జూలై 6 నుంచి 10 లోపు సప్లిమెంటరీ బిల్లులు పెట్టాల్సి ఉండగా, సీఎఫ్‌ఎంఎస్ సైట్ 10 వ తేదీతోనే ఆపివేయడం వల్ల నిర్ణీత సమయంలో బిల్లులు సమర్పించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కారణంగా మరో నెల రోజులు పాటు జీతాలు అందని పరిస్థితి ఉపాధ్యాయులకు నెలకొందన్నారు. గిన్నీస్ బుక్ రికార్డుల మోత మోగించడంలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయులకు ఈ రీతిన బహుమానం ఇవ్వడం సరైంది కాదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులకు జీతాలు వచ్చేలా చూడాలని కోరారు.

పూల్ కలాసీల సమస్య పరిష్కారానికి హామీ

దాబాగార్డెన్స్: పోర్టు పూల్ కలాసీల సమస్య త్వరలో పరిష్కరిస్తానని కేంద్ర పోర్టు, షిప్పింగ్ వాటర్ వేస్ కార్యదర్శి రామచంద్రన్ హామీ ఇచ్చారని పూల్ కలాసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.అప్పారావు, కార్యదర్శి చింతపల్లి పోతురాజు, ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు హేమంత్‌కుమార్ తెలిపారు. విశాఖ విచ్చేసిన ఆయనను కలిసి పూల్ కలాసీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని వినతిపత్రం అందజేశారు. గత 28 ఏళ్లుగా పోర్టులో వివిధ విభాగాల్లో పని చేస్తూ, చాలీ చాలని జీతంతో కొట్టుమిట్టాడుతున్నామని, టైం స్కేల్ వర్తింపజేయమని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నామని, సంబంధిత అధికారులు స్పందించాలని కోరినట్టు తెలిపారు. పూల్ కళాసీల పేరిట కంప్యూటర్ ఆపరేటర్, క్రేన్ ఆపరేటర్, పంప్ ఆపరేటర్, సెక్యూరిటీ గార్డ్, క్లర్క్, ఎలక్ట్రీషియన్లుగా పని చేస్తున్నప్పటికీ సమాన పనికి సమాన వేతం లేకుండా పూల్ కలాసీల జీవితాలు ముగిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది పూల్ కలాసీలను పర్మినెంట్ చేసి, మిగిలిన 530 మందిని పర్మినెంట్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని, ఫలితంగా చాలీ చాలని జీతాలతో అవస్థలు పడుతున్నామన్నారు. వాసుపల్లి రాము, కె.శ్రీనివాస్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.


అలరించిన సంగీత విభావరి

సీతంపేట: రసరాగ మాధురి వార్షికోత్సవం సందర్భంగా స్వరసాగర్ ఆర్కెస్ట్రా సహకారంతో మంగళవారం సాయంత్రం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. సంస్థ ప్రతినిధులు ఎం.ఎస్.మాధవ్, స్వర సాగర్ సింగ్ ఆధ్వర్యంలో నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు హుషారైన గీతాలతో ప్రేక్షకులను రంజింపజేశారు. గాయనీ గాయకులు పి.ఎస్.వి.ప్రసాద్, ప్రియ, సుధావాణి, హర్షిణి, సాత్విక, మాధురి, సుజాత, మెలోడి సత్యనారాయణ, ప్రభాకర్ యుగళ గీతాలు ఆలపించారు.

శాకంబరిగా లలితాదేవి



కూరగాయలతో అలంకరించిన లలిత అమ్మవారి మండపం



శాకంబరి అలంకారంలో లలితాదేవి

సీతంపేట: ఆషాఢమాసం, బహుళ పంచమి సందర్భంగా అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలోని లలితాకామేశ్వరి అమ్మవారు మంగళవారం శాకంబరిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారిని, అలయ మండపాన్ని బీర, బెండ, ఆనప, క్యాప్సికం , టమాటా, వంగ, దొండ, దోస, బీట్‌రూట్ వంటి సుమారు 15 రకాల కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో అలంకరించారు. పీఠంలో గల ఉప ఆలయాలలో దేవతా మూర్తులను సైతం కూరగాయలతో అలంకరించారు. ప్రత్యంగిరా దేవి, కాళీకాలభైరవులు, వారాహిదేవి, మణిద్వీపంలో శ్రీచక్రం, విజయ గణపతి, కామేశ్వరుడు, కల్యాణ వేంకటేశ్వర స్వామిని కూరగాయలతో అలంకరించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ అమ్మవారితో పాటు పీఠంలోని దేవతామూర్తులను సుమారు 450 కిలోల కూరగాయలు, పండ్లతో అలంకరించినట్లు చెప్పారు. ఈ కూరగాయలతో గురువారం కదంబం వండి, ఆ రోజు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేస్తామని తెలిపారు. భక్తులు పాల్గొని, కదంబ ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి విద్యుత్ కార్మికుల వినతి



ఈపీడీసీఎల్ సీజీఎం సుమన్ కల్యాణికి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

తాటిచెట్లపాలెం: జేఎల్‌ఎం గ్రేడ్-2 ఎనర్జీ అసిస్టెంట్లను విద్యుత్ సంస్థలో పూర్తిగా విలీనం చేసి, అసిస్టెంట్ లైన్‌మెన్లుగా ప్రమోషన్లు ఇవ్వాలని, ఏపీఎస్ ఈబీ సర్వీస్ రూల్స్ ప్రకారం టైం స్కేల్ వర్తింపజేయాలని కోరుతూ ఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్‌డీ) డి. సుమన్ కల్యాణికి యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. అదే విధంగా వినతిపత్రాలను రాష్ట్ర వ్యాప్తంగా సేకరిస్తామని, ప్రాణాలకు తెగించి పని చేస్తున్న జేఎల్‌ఎం గ్రేడ్-2లకు న్యాయం చేయాలని వీరు కోరారు. ఈ విషయంలో న్యాయం చేసేలా ప్రయత్నం చేస్తానని సీజీఎం హామీ ఇచ్చినట్లు వీరు తెలిపారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్. సత్యారావు, పి. శ్రీనివాసరావు, పి. చంద్రశేఖర్, గ్రేడ్ 2 జేఎల్‌ఎం నాయకులు ఎస్. అప్పలరాజు, కె. శంకర్రావు, ఎస్. ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.